వత్సరాజు

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు

(ఒక ఘట్టం)

వత్సదేశాధిపతి ఉదయనుడూ ఉజ్జయినీనగర చక్రవర్తి మహాసేనుడూ గర్భశత్రువులు. వారి మూలంగా దేశానికి శాంతి ఉండేదికాదు అప్పుడు దేశ క్షేమంకోసం మహాసేనుడు తన కుమార్తె వాసవదత్తను వత్సరాజున కిచ్చి స్నేహం చేసుకోవాలనుకున్నాడు దానికి కావలసిన ప్రయత్నాలన్నీ చేశాడు కాని లాభంలేక పోయింది

మహాసేనుడప్పుడు సేనలతో నిండిన ఓ మాయ ఏనుగును తయారు చేసి అడవిలో ఉంచాడు వేట తమకం గల వత్సరాజా ఏనుగును వేటాడడానికి వెళ్లి శత్రువులకు లొంగిపోయాడు

ఈ ఘట్టమందలి పాత్రులు

బాదరాయణుడు, మహాసేనుడు, అంగారవతి

బాద: ఆ భీరకా! ఓ భీరకా! కాశీరాజోపాధ్యాయుడు ఆర్యజైవంతి దూతగా వచ్చాడని మహాసేన మహారాజు గారు చెప్పినట్లు ప్రతీహార రక్షకునితో చెప్పు. ఈ దూతకి సామాన్య సత్కారాలు మానివేసి అతిథిగా సత్కరించారన్నట్లు చేయాలి.

ఓ సమాన స్థాయీగల రాజవంశాలనుండి కన్యాదానం చేయమంటూ దూతలు రావడం అలవాటైపోయింది. మన రాజుగారు—'వీడు తగిన వాడు, వీడు తగని వాడు' అని ఎవ్వరినీ ఇంతవరకు అనలేదు కాకపోతే—కన్యాదాన విషయానికి దైవమే కారణమా? అయితే బ్రహ్మదేవుడు ఏ వధువుకు ఏ వరుని నియమించాడో అలాగే జరిగి తీరుతుంది. అంత వరకూ మన రాజుగారు ఆ వరుని దూతను పోల్చుకోనే లేరు.

ఓ, అదిగో—అంతఃపుర పరిచారకుల సందడి జాస్తిగా ఉంది. మహారాజువారు వస్తూన్నట్లు కనిపిస్తూంది అవును. ఆయనే మహారాజు. నేనూ అక్కడికే వెడతాను.

[పరివారంతో రాజు ప్రవేశిస్తాడు]

మహా ఈ ప్రపంచంలో ఉన్న రాజులందరూ నా గుర్రపు డెక్కలలోంచి పుట్టిన ధూళిని శిరస్సులమీద ధరిస్తూ ఉన్నారు. బాగానే ఉంది కాని, గజహృదయం తెలిసిన వత్సరాజు నాకు నమస్కారం చేయక పోవడంవల్ల ఇవన్నీ వృథా అనిపిస్తున్నాయి. అంతే కాదు మనస్సుకు సంతోషం లేనేలేదు కానీ—

బాదరాయణా!

[ప్రవేశించి]

బాద: మహాసేన మహారాజుగారికీ జై. ఏమి సెలవు?

మహా జైవంతిని గౌరవించినారా?

బాద ప్రభూ! తగిన భవనమునందుంచి గౌరవించాము.

మహా మాయందు నీకలాంటి విశ్వాసమున్నది కాబట్టి మా గౌరవం దక్కిస్తున్నావు అయినా అతిథుల్ని పూజించడం మంచిదే కదా! లేకపోతే—కన్యా దానం చేయమంటూ అడుగ వచ్చిన వారికి కొంచం లొంగవలసి వస్తుంది. ఆం ఏమో చెప్పడానికి ప్రయత్నిస్తున్నావేమిటదీ?

బాద చెప్పడాని కేముంది బాబూ! కన్యా దానాని గురించే ఆలోచిస్తున్నాము.

మహా అవును అవును ఇది అందరికీ కావసినదే చెప్పు.

బాద ప్రభూ! ఈ విధంగా రోజూ మనకు తగిన రాజ వంశాల్లోనుండి ఎవరో ఒకరు దూతలుగా వచ్చి వెడు

తున్నారు ఏలిన వారందులో ఎవరినీ కాదనలేదు, అవు నవలేదు. కారణం ?

మహా కారణమా ? అతి గుణవంతుడైన వరుడు కావాలనీ, వాసవదత్త మీద ఉన్న వాత్సల్యంచేత ఎవర్నీ నిర్ణయించలేకుండా ఉన్నాను ఇంకో సంగతి—వరుడు మంచి కీర్తిశాలీ, కులీనుడూ, దయామయుడూ, పరాక్రమవంతుడూ, బలవంతుడూ, శత్రు భయంకరుడూ, స్త్రీలను రక్షించే సామర్థ్యంగలవాడూ అయివుండాలని కూడా వుంది

బాద ప్రభూ, ఇలాంటి గుణసంపద మహాసేనుడు కుమారస్వామికి తప్ప ఇంకెవ్వరికి ఉన్నదీ.

మహా అందుకే ఆలోచిస్తున్నాను. తల్లి తండ్రుల ప్రయత్నాలవల్ల కన్యకు వరుడు దొరుకుతాడు. కాని ఆమె అదృష్టంకూడా కలసిరావాలి. ఏమంటావు ? అయినా- కన్యాదాన సమయంలో తల్లి దుఃఖపడుతుంది కాబట్టి- దేవి అంగారవతిని పిలుచుకుని రా.

బాద చిత్తం. [వెళ్లును]

మహా ఓ ! కాశీరాజు దూతను పంపించినట్లుగానే వత్స రాజును పట్టుకోడానికి వెళ్లిన శాలంకాయనా మాత్యుని మీదికి బుద్ధి వెళుతూంది ఆ బ్రాహ్మణుడింత వరకూ ఏ కబురూ పంపించాడే కాదు.

[పరివారంతో దేవి ప్రవేశిస్తుంది.]

అంగారవతి మహాసేన మహారాజులకు జై.

మహా దేవీ ! అంగారవతీ ! రా కూర్చో.

అంగా చిత్తం. [కూర్చుండును]

మహా అమ్మాయి, వాసవదత్త యేది ?

అంగా ప్రభూ ! ఉత్తరవైతాళిక దగ్గర నారదీయ వీణ నేర్చుకోడానికి వెళ్లింది.

మహా ఆఁ సంగీతమా ! ఆ ఆశక్తి దానికెలా కలిగింది ?

అంగా కాంచనమాల అనే చిన్నది తన వీణకి బంగారు పూలమాల చేయించుకోవడం చూసింది. అప్పటినుంచీ దీనికి సంగీతం నేర్చుకోవాలని శ్రద్ధ పుట్టింది.

మహా నిజంగా ఇప్పుడే అది నేర్చుకోవాలి. మంచి ఊహే కలిగింది

అంగా మహారాజా ! మీకు సమస్తమూ తెలుసును. అయినా నేనో మాట అడగాలనుకుంటున్నాను. అడగమన్నారా ?

మహా ఆఁ తప్పకుండా.

అంగా మన అమ్మాయికి సంగీతం నేర్పడానికి ఉపాధ్యాయుడు కావాలి చూస్తారా ?

మహా ఎందుకే వెర్రిదానా ! దాని భర్తే దానికి నేర్పుతాడు. పెండ్లీడు వచ్చిన పిల్లకి పైవాడుపాధ్యాయుడా.

అంగా ఆఁ. ఏమనుచున్నారు ? దానికిది పెండ్లి సమయమా ?

మహా దేవీ ! నిన్న మొన్నటిదాకా దీనికి వివాహం చేయమనే నువ్వు—ఈ వేళ దుఃఖంగా అడుగుతున్నావేమి?

అంగా లేదండీ ! దానికి వివాహం చేయడమంటే నాకూ ఇష్టమే. కాని దానిని విడిచి ఉండగలనా అని భయపడుతున్నాను. అయితే; ఎవ్వరికిచ్చారు ?

మహా ఇంకా నిశ్చయించలేదు.

అంగా లేదా ?

మహా కన్యను ఎవరికేనా ఇవ్వక పోతే సిగ్గు. ఇస్తే దుఃఖం. ధర్మ బద్ధులైన తల్లులీ రెంటిలోనూ పడి వియోగ దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంటారు. వాసవదత్త ఇప్పుడు అత్తమామల్ని సేవించే వయస్సులో ఉంది. మరో సంగతి — కాశీరాజోపాధ్యాయుడు ఆర్యజైవంతి దూతగా వచ్చి నన్ను మభ్య పెడుతున్నాడు. దేవీ ! ఏమీ చెప్పకుండానే దుఃఖ పడుతున్నావు. కార్య భారాన్ని చూచి నిర్ణయిస్తావా ? మన వాసవదత్తను చేసుకొంటామంటూ నా చుట్టాలనేకులు వస్తున్నారు.

అంగా ప్రభూ ! వస్తున్నారు. నిజమే. ఎవరికిచ్చిన మనకు సంతాపం ఉండదో వానికివ్వండి.

మ : ఓ ! ఈవేళ చులాగ్గా మాటాడుతున్నావు. ఆ తరువాత నిందిస్తావు నీకు నచ్చిన సంబంధమే చేస్తాను చూడు—మన సంబంధం కావాలని మాగధులూ,

మైథిలులూ, శూరసేనులూ, సౌరాష్ట్రులూ, అంగదేశాధీశులూ వస్తున్నారు వీరిలో నీకెవ్వరిష్టమో—

[ప్రవేశించి]

బాద వత్సరాజు.

మహా (కోపంతో సింహాసనం మీదనుండి లేచి) వత్సరాజేమి ?

బాద ప్రభూ ! మన్నించు. మన్నించు ప్రియం చెప్పే తొందరలో మర్యాదను అతిక్రమించాను

మహా ఏమిటీ ! ఏమిటీ ! ప్రియమా ?

అంగా (లేచి) మహారాజులకు జయం.

మహా (సంతోషంతో) దేవికి ప్రియమైన మాటలంటే ఇష్టం. కూర్చో

అంగా : చిత్తం.

మహా (బాదరాయణునిచూచి) లెమ్ము లెమ్ము. ధైర్యంగా చెప్పుము.

బాద : (లేచి) శాలంకాయణమాత్యులు వత్సరాజును పట్టుకొన్నారు.

మహా (హర్షంతో) ఏమిటీ ! ఏమిటీ ! ఏ—

బాద : శాలంకాయణమాత్యులు వత్సరాజును పట్టుకున్నారు.

మహా పట్టుకొన్నాడా ?

బాద పట్టుకొన్నారు.

మహా : ఉదయనుడా ?

బాద : ఆఁ.

మహా శతానీకుని కుమారుడా ?

బాద అవును

మహా సహస్రానీకుని మనుమడే !

బాద ముమ్మాటికి.

మహా : కౌశాంబికి ప్రభువు !

బాద కౌశాంబికి ప్రభువు.

మహా గాంధర్వవేత్త !

బాద : ఆఁ.

మహా వత్సరాజే !!

బాద వత్సరాజు మహారాజా ! వత్సరాజు.

మహా అయితే ఆతని మంత్రి యౌగంధరాయణుడు మరణించినాడా ?

బాద లేదు లేదు. అతడు కౌశాంబిలో ఉన్నాడు.

మహా అయితే, దొరికినవాడు వత్సరాజుకాదు

బాద అతడే, ప్రభూ !

మహా ఓరీ ! వత్సరాజును పట్టుకోవడమంటే ఏమిటనుకుంటున్నావు ! ఆ పని పంచాగ్ని సర్పాన్ని చేతితో ఎత్తడం వంటిది. పైగా ఆతని శౌర్యాన్ని శత్రువులే స్తోత్రం చేస్తారు. ఇంకో సంగతి జ్ఞప్తియందున్నదా—యౌగంధరాయణమంత్రి యెత్తులింతవరకూ చెవుల్లో గింగురుమంటున్నాయి

బాద అవును ప్రభూ ! వృద్ధబ్రాహ్మణుణ్ణి. మీదగ్గరెన్నడైనా అబద్ధం ఆడి ఉన్నానా ?

మహా అయితే-శాలంకాయనుడు పంపిన ప్రియదూత ఎవ్వడూ ?

బాద : ప్రభూ ! దూతరాలేదు వడిగల గుర్రాల్ని కట్టిన రథం మీద వత్సరాజును ఎక్కించుకుని అమాత్యులవారే వచ్చారు

మహా ఆఁ అలాగా ఇంక నా సేనలకు కవచాలక్కరలేదు. విశ్రాంతి తీసుకుంటాయి. ఇప్పటినుండీ గూఢచారుల పనులుండవు

అంగా ప్రభూ ! అమాత్యులే తీసుకుని వచ్చినారా !

మహా అవును, దేవీ !

అంగా ఈ కారణంవల్ల వాసవదత్తను ఎవ్వరికివ్వడమా అనే తలంపులేనివారమైనాము

మహా పరాజితుడైన ఆతడు నాకు గర్భశత్రువు బాదరాయణా ! శాలంకాయను డెక్కడున్నాడు ?

బాద భద్రద్వారమున

మహా రాజకుమారుల్ని గౌరవించినట్లు ఆ వత్సరాజును గౌరవించండి ఆతనితో అమాత్యునికూడా రమ్మని చెప్పు.

బాద చిత్తం (వెళ్లుచుండును).

మహా ఇదిగో—

బాద ఏమిసెలవు—

మహా వత్సరాజును చూడడానికి వచ్చినవారిని వారింప వద్దు. ఏమంటే, ఆతని శౌర్య పరాక్రమాలు జనులిది వరకు కథలుగా చెప్పకునేవారు ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తారు.

బాద ఆజ్ఞానుసారం. (వెళ్లిపోవును)

అంగా ఈ కోటలో అనేక సౌఖ్యాలనుభవించాం అయితే ఇలాంటి ఆనందం మహాసేనులకెన్నడూ కలగలేదు.

మహా ఈ వత్సరాజును పట్టుకొన్నందువల్ల కలిగిన ఆనందం, మరి దేనివల్లా కలిగినట్టు నాకూ జ్ఞప్తియందులేదు.

అంగా ప్రభూ! నిజంగా ఆతడు వత్సరాజేనా?

మహా సందేహమెందుకూ?

అంగా మనతో సంబంధంకోరి అనేక మహారాజులు దూతల్ని పంపించారు కదా! ఇతనెందుకు పంపలేదు?

మహా ఇతడు—'మహాసేనుడు' అన్న పదాన్నే వప్పుకోడు అలాంటివాడు మన సంబంధాన్ని అపేక్షిస్తాడు?

అంగా బాలుడా? మూర్ఖుడా?

మహా బాలుడూకాడు మూర్ఖుడూకాడు.

అంగా అయితే ఎందుకీగర్వం?

మహా విను—సుప్రసిద్ధ భరతవంశం వంశమనీ, గాంధర్వ వేదం తెలుసుననీ, వయస్సుకు తగిన రూపమున్నదనీ, పౌరులు తనని గౌరవిస్తారనీ గర్వం.

అంగా ఇవి, వరునకుండవలసిన గుణాలే కాని, ఎవరి నామభావం దీనికి కారణమో తెలియడం లేదు

మహా దేవీ! అనర్ఘావస్తువును మెచ్చుకొందువేలా?

[ప్రవేశించి]

బాద జయం. శాలంకాయనామాత్యులు గౌరవ పూర్వకంగా ప్రవేశించారు. భరతకులోపభుక్తమై వత్సరాజు వంశంలో ఉన్న ఈ ఘోషవతి అనే వీణారత్నాని తమ కిమ్మని పంపినారు. (వీణను చూపిస్తాడు)

మహా. ఆహా! జయమంగళము ప్రాప్తించింది (వీణ తీసుకుని) దీని ధ్వని అతిమధురం ఆ మధురధ్వని ఏనుగుల మనస్సుల్ని బలవంతంగా ఆకర్షిస్తుంది. ఏమి చెప్పను! ఇంకా విరోధులికి ఇష్టమైనవాటిని కలిగిస్తుంది నా పెద్ద కుమారుడర్థశాస్త్రవేత్త వాడికిది అక్కరలేదు రెండో వాడికి వ్యాయామం తప్పితే మరేమీ అక్కరలేదు. అయితే దీన్ని ఎక్కడుంచను? దేవీ! వాసవదత్త వీణ నేర్చుకొనుచున్నది కదూ!

అంగా ప్రభూ! నేర్చుకొనుచున్నది

మహా అయితే, దీనిని దాని కియ్యి

అంగా ఇంక దీనిని ఎప్పుడూ విడిచి పెట్టదు. దీనితో క్రీడిస్తూ ఉంటుంది.

మహా క్రీడించనీ, క్రీడించనీ ఇది అత్తవారింటిలో సాధ్యం కాదుకదా! బాదరాయణా! అదెక్కడా?

బాద మంత్రితో.

మహా వత్సరాజు?

బాద అలసి ఉన్నాడు ఆతనికి శరీరమంతా గాయాలు పడ్డాయి అందువల్ల పల్లకీలో లోపలి గృహంలోనికి తీసుకు వెళ్లారు.

మహా అయ్యో! గాయాలా! ఎంత పని ఇది శిక్షలేని శౌర్యంవల్ల కలిగింది ఇప్పుడాతని విషయంలో నేను ఉపేక్షిస్తే నన్నందరూ దుర్మార్గుడంటారు బాదరాయణా! త్వరగా వాని గాయాలు పోవడానికి తగిన చికిత్స చేయమని నా మాటగా భరతరోహకునితో చెప్పు.

బాద చిత్తం (వెళ్లుచుండును).

మహా ఇదిగో—

బాద మహారాజ!

మహా: అతని కోర్కెలు గౌరవ పూర్వకంగా నెరవేర్చండి. ఆతని ముఖవైఖరిని పట్టి పనులు తీర్చాలి. యుద్ధవార్త

నేమీ అక్కడ ప్రసంగించవద్దు. అతను తుమ్మినా ఏమి చేసినా ఆశీర్వదించాలి. సమయానుకూలంగా పొగడాలి.

బాద : చిత్తం (వెళ్లి—వచ్చి) మహారాజ! ఆతని గాయాలకి మార్గమధ్యంలో చికిత్స చేశారట! రెండవ చికిత్సకిది వేళకాదన్నారు. రెంపు ఝాములైంది. ఏమి సెలవు?

మహా : ఆ వీరుడెందున్నాడు.

బాద : మయూరయష్టి ముఖమునందున్నాడు.

మహా : అయ్యో! అక్కడ వద్దు. బాగా ఎండ తగిలే మణిభూమికలో ఉంచమని చెప్పు.

బాద : చిత్తం (తిరిగి వచ్చి) సమస్తమూ చేసినారు. భరతరోహకామాత్యులు తమ దర్శనార్థం ద్వారంకడ నిలిచి ఉన్నారు.

మహా : వత్సరాజును గౌరవించడం ఈతనికి ఇష్టంలేదు. రాజనీతి అలాంటిది. నేనే ఆతని విషయం తెలుసుకొంటాను.

అంగా : సంబంధం నిశ్చయమైనదా?

మహా : లేదు దేవీ!

అంగా : అమ్మాయి చిన్నది కదా!

మహా : నీ యిష్ట ప్రకారం చెయ్యి వెళ్లు.

అంగా : చిత్తం. (పరివారంతో దేవి వెళ్లును.)

మహా : ఆహా! వీడి గర్వాన్ని పూర్వం నేను సహించలేకపోయేవాణ్ణి. ఇప్పుడాతడు సంశయావస్థలో ఉన్నాడు. ఈ తీసుకు రావడంలో నా కేమీ పాలు పోవడంలేదు. ఏమి చెయ్యాను?

[అందరూ వెళ్లుదురు]

(నా 'వత్సరాజు' నాటికనుండి)

★

తల వెంట్రుకలను పెంచును

రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూదేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు.

RITA

HAIR TONIC